# ప్రయాణం

"ఎందుకయ్యా, అంత హడావుడిగా యీ సందులోకి లాక్కొచ్చావ్?" శ్రీనివాసరావు చిరాగ్గా అడిగాడు రామారావుని.

"మీరు చూడలేదుగానండి, మన రిటైర్డ్‌గాంగీ మెయిన్ రోడ్డులో నుంచీ వస్తున్నారు. ముసలాళ్లు ఆవలిస్తే పేగులెక్కెట్టేస్తారు" పచ్చగామెరిసే నుదుటిమీదికి చెదిరివచ్చిన నల్లని ఒంకీల జుట్టుని వెనక్కితోసుకుంటూ నవ్వుకుంటూ అన్నాడు రామారావు.

ఆరడుగుల ఎత్తుపెరిగినా, మదనపల్లె కాలేజిలో ఇంగ్లీష్ లెక్చరర్ అయినా, ముప్పై అయిదేళ్లు నెత్తిమీదికివచ్చినా కుర్రతనం వొదల్లేదు అతనికి. ఉదయం పదిగంటలై బ్యాంకులూ, ఆఫీసులూ, షాపులూ తెరిచాక పనులమీద మైన్‌రోడ్‌లోకి వచ్చి, కబుర్లు చెప్పుకుంటూ జతలుగా వెళ్తుంటారు కాలేజిలో పని చేసి రిటైరైన సీనియర్ లెక్చరర్లు. రామారావు తండ్రికూడా ఆ బాపతే.

"గాంగీ ఏమిటయ్యా? మొన్నటి దాకా ముసలితనం అంటే ఓపిక తగ్గిన కాలం. ఇప్పుడు రిటైర్మెంట్ అంటూ ఓపికవున్నవాళ్లకే cut off date యిచ్చేశాం. రిటైరయ్యాక సుఖంగా బ్రతకటం ఎలాగో వాళ్ళు చూపిస్తున్నారనుకుంటే సరిపోలా?" అని కోప్పడ్డాడు శ్రీనివాసరావు.

తన డిపార్ట్‌మెంట్‌హెడ్ కొంచెం సెంటిమెంట్ మనిషని గుర్తుకువచ్చి నాలుక్కరుచుకున్నాడు రామారావు. "ఈ సందు మా యింటికి షార్ట్‌కట్ కూడానండి" అన్నాడు సర్దుబాటుగా.

వాళ్లిద్దరూ రామారావు అద్దెకుంటున్నయిల్లు చేరారు. అక్కణ్ణుంచీ రెండుగంటల మాటీనీషో ఒక దానికి వెళ్లాలని ప్రోగ్రాం.

"మాయింటి ఓనరు కాంతయ్యగారికి ఏదో అల్సరు ఆపరేషన్ అని-కాన్సరే మోలెండి-బెంగుళూరు వెళ్తున్నారు యివాళ... అక్కడ ఆయన కొడుకున్నాడు లెండి...

ఏడాది నుంచీ యీయింట్లోనే వుంటున్నానుగదా, నాకు యీకుటుంబమంతా తెలుసు... ఆయన అన్న తొంభైఏళ్ల పెదతాత, అక్క ఎనభైఎనిమిదేళ్ల రాజవ్వ, తమ్ముడు ఎనభైఏళ్ల 'చిన్నోడు' తాత, వూళ్లో నాలుగుమూలల్నుంచీ అయన్ని చూడటానికి కుటుంబాల సమేతంగా దిగుతున్నారు'' ఇంటి ముందు కనబడుతున్న సందడికి కారణం వివరించాడు రామారావు తేలిగ్గా నవ్వుతూ.

ఉదయంనుండి కాంతయ్యతాతగారింట్లో ఒకటే హడావుడిగా వుంది. బంధువులందరూ ఒక్కొక్కరే దిగుతున్నారు. దిగువ కమ్మపల్లె నుంచి పెదతాతా, పెద్దవ్వా జట్కాబండిలో వచ్చారు తొమ్మిదిగంటలకే. వారి తాలూకు కుటుంబసభ్యులు యింట్లోపనులు ముగించుకుని, తాళాలువేసుకొని యింకో గంటలో వస్తారట. బండమీద కమ్మపల్లె నుంచీ రాజవ్వా, ఆమె భర్తా, కొడుకూ బస్సులోవచ్చి దిగారు. కమ్మవీధి నుంచీ చిన్నోడుతాత కుటుంబం ఆఖర్న దిగింది రిక్షాల్లో. టాక్సీ రెడీగా వుందో లేదో చూసి, అట్నుంచీ వస్తానన్నాడట చిన్నోడు తాత. అందరూ చేరేసరికి పదకొండు గంటలయింది.

మగవాళ్లు ముందు హాల్లో కుర్చీల్లో కూర్చున్నారు. ఆడవాళ్లంతా వెనుకగదిలో చాపలమీద తీరిగ్గా కాళ్లు చాచుక్కూర్చుని కాంతయ్యతాత బెంగుళూరు ప్రయాణం గురించీ, అక్కడ ఆయనకు జరగబోయే ఆపరేషన్ గురించీ మాట్లాడుకుంటున్నారు.

తాత తిరిగిరావడానికి నెలరోజులు పడుతుంది... కుట్లుమానాలి... బలం రావాలి... చిన్నవయసు కాదుగదా... కాస్త ఆలస్యం అవుతుంది- ఇవేమాటలే అందరూ తలోసారీ అన్నారు, నెలరోజుల తర్వాత కాంతయ్య తాత తిరిగి రావడం విషయంలో తనమట్టుకు సందేహంలేదని ధ్వనిస్తూ.

సుబ్బవ్వ యిటుకేసి రాకుండా వంటిట్లో వూరికే తొందర పడిపోతున్నది. బెంగుళూరులో వుద్యోగం చేస్తున్న కొడుకు చలపతి రెండురోజుల క్రితం వచ్చాడు. తండ్రిని బెంగుళూరికి తీసుకెళ్తాననీ, అక్కడ పెద్దడాక్టర్లకు చూపించి అవసరమైతే ఆపరేషన్ చేయించేస్తాననీ చెప్పినప్పటినుంచి ఆమెకు మనసంతా ఎట్లాగో అయిపోయింది. ఆపరేషన్ చేస్తే... చేస్తే... చెయ్యకుంటే... ఎంతకాలం యీనొప్పిని యిట్లా భరిస్తాడు? తిండి తినలేడు. మనిషి కరిగిపోతున్నాడు! ఈ ఎనభైమూడేళ్ల వయస్సులో- మొదలే బలహీనమైపోయిన ముసలాయన - ఆపరేషన్‌కు తట్టుకోలేడని, యిక్కడి డాక్టరు ఏపూటకాపూట మందులతో, నొప్పిమాత్రలతో నెట్టుకొస్తున్నారు. కాని చలపతి గట్టిగా చెప్పాక ఏదోఒకటి చేస్తేనే ఆయన ప్రాణానికి సుఖం అన్న తెగువ వచ్చింది సుబ్బవ్వకు. "అక్కడ గొప్పగొప్ప డాక్టర్లుంటారు!" అనుకుంది.

అదేగాకుండా ఆమె సలహా ఎవరూ అడగలేదు. కొడుకు చెప్పిన మాటను దాటి ఆలోచించడం కాంతయ్యగారికి అలవాటు లేదు. ప్రయాణానికి ఏర్పాట్లు జరిగిపోతున్నవి.

ఒంటిగంటకు టాక్సీ వస్తుంది.

నీవూ ఒస్తావా? అని కొడుకు ఆమెను అడగలేదు. తన అభిప్రాయమంటూ ఒకటి ఆమె ఏర్పరచుకోలేదు. వ్యవహారాల్లో తలదూర్చే హక్కు ఆమెకు ఎప్పుడూలేదు.

సుబ్బవ్వకు తానే ప్రయాణమౌతున్నట్లుగావుంది. లోకమంతా తలక్రిందులై పోతున్నట్లుగావుంది. తనేదో తప్పుచేసి యీ పరిస్థితికి బాధ్యురాలైనట్లుగానో, తనకేదో అన్యాయం జరిగిపోతున్నట్లుగానో తెలియరాని, అస్పష్టమైనబాధతో మనసంతా చిక్కురొక్కురుగా కలగాపులగంగా, గందరగోళంగావుంది. ఆ గందరగోళాన్ని ప్రక్కకుపెట్టి, యింటికొచ్చి దిగుతున్న బంధువులందర్నీ అయిష్టంగా చూసింది. 'వీళ్లలో ఎందరుంటారో, వంట మళ్లీ మొదలెట్టుకోవాలి!' అనుకుంది బరువుగా.

కాంతయ్యతాత యీరోజు మామూలుకంటే ముందుగానే మంచందిగి, మెల్లగా ముఖం కడుక్కుని, తెల్లని ఇస్త్రీబట్టలు వేసుకుని ముందుహాల్లో మంచంమీద, గోడకు చేరగిలబడి కూర్చున్నాడు. వరుసగా అన్న, అక్క, తమ్ముడుగార్ల కుటుంబాలన్నీయింట్లో చేరుతుంటే ఆయన ముఖం విప్పారింది. నొప్పి ఒకప్రక్కన తొలుస్తున్నా లెక్కచెయ్యకుండా కూర్చున్నాడు. రాత్రంతా బాధతో విలవిల్లాడి, తనతోపాటు యింటిల్లపాదినీ జాగారం చేయించిన సూచనలు యిప్పుడేమీ కన్పించటంలేదు.

"ఒరే మధూ, మీ తాతనిట్లా పిలువు! పొద్దుట్నుంచీ ఏమీ తినలేదు!" అని కేకేసింది సుబ్బవ్వ వంటింట్లోంచీ,

బంధువుల మధ్యనుంచీ కాంతయ్యతాత లేచివచ్చాడు. వంటింట్లో కుర్చీలో కూర్చుంటూ "వాళ్లందరికీ యిక్కడే అన్నంచెయ్యి" అన్నాడు సంతోషంతో పొంగిన ముఖంతో.

ఎప్పుడూవాళ్లు. వాళ్లు! వాళ్లు ఈయనకేం ఒరగబెడుతున్నారని యింత ఆనందం? 'ఏ అక్కఱకైనా తమ బాధ తామేపడి నెట్టుకొచ్చారు గాని ఇందులో ఏ ఒక్కరూ ఒక్క నయాపైసా యిచ్చినవాళ్లు గాదు! ఇవన్నీ పైపైనాటకాలు! అనుకుంది సుబ్బవ్వ ఈసడింపుగా.

"వాళ్లసంగతి సరేగాని ముందు మీ తిండి సంగతి చూడండి" అని కసురుతూ ఇడ్లీలపళ్లెం ముందు పెట్టింది.

కాంతయ్యతాత ముఖంలోని ప్రసన్నత పోయింది. తనూ, తన సంసారం తప్ప ఈ మనిషికేమీ కాబట్టదు, ఏమీ అర్థంకాదు! ఇహ ఈ మనిషి యింతే! అనుకున్నాడు.

పళ్లెంలోనుంచీ ఇడ్లీ ఒకటి చేతిలోకి తీసుకుని పరధ్యానంగా నలిపి నలిపి ముద్దచేస్తూ కూర్చున్నాడు.

సుబ్బవ్వకు ఏమేమో అడగాలనీ, చెప్పాలనీ, చెయ్యాలనీ ఆరాటంగావుంది.

కాని చెప్పటానికి, అడగటానికి ఏమీతోచలేదు,

తినకుండా, వూరికే పిసుకుతున్నారేం?" అన్నది చిరాగ్గా

కాంతయ్యతాత చేతిలోవున్న ఇడ్లీ ముద్దనే కొంచెం తుంచి నోట్లో పెట్టుకున్నాడు. వాంతికొచ్చింది. ప్రక్కనేవున్న స్నానాల గదిలోనికి వెళ్లివచ్చి మళ్లీ కూర్చున్నాడు.

"కారు ఒంటి గంటకొస్తుందంట' అన్నది సుబ్బవ్వ.

"అవును" అని తలూపి, "డబ్బు బీరువాలో వుంది. కావల్సినప్పుడు వాడుకో... జాగ్రత్త " అన్నాడు.

తర్వాత వాళ్లిదర్దికీ చెప్పుకోవల్సింది యింకేమీ లేకపోయింది.

తమ్ముడు రావటంతో లేచి ముందు హాల్లోకి వెళ్లిపోయాడు.

సుబ్బవ్వకి ఏడుపొస్తోంది. జాగ్రత్త ఏమిటంటా?... నేనేమన్నా ఆ డబ్బులెత్తుకెళ్లి జలదారిలో పోస్తానా? ఎప్పుడూయింతే, పిసినారిబుద్ధులు! కాల్చుకుతింటున్నారు!. అనుకుంది అలవాటు ప్రకారంగా. యాభైఏళ్లుగా యింటి ఖర్చులవిషయంలో ఎప్పుడూ ఘర్షణే వాళ్లమధ్యన. ఆమెకు ఎప్పుడూ డబ్బు తక్కువగానే వుంటుంది.

ఒక పండుముసలిది దిక్కులుచూచుకుంటూ లోపలికొచ్చింది. ఎవరెవరు వచ్చారో ప్రక్కచూపుల్తో గుర్తిస్తూ, హాలుదాటి లోపలిగదిలోని ఆడవాళ్ల దగ్గర కొచ్చి నిలబడింది. చాపలమీద కూర్చుని వున్నవాళ్లందరినీ పరకాయించి చూసింది.

"అయ్యని బెంగుళూరు తీసుకెళ్తున్నారంటనే" అన్నది. ముగ్గుబుట్టలాంటి తల ఊగిసలాడుతుంటే ముక్కుచీది, కళ్లు చీరకొంగుతో తుడుచుకుంటూ-

"పార్వతీ పరమేశ్వరులల్లే వున్నారమ్మా యాభై సంవత్సరాల్నుంచీ... మంచి వాళ్లు..." అన్నది. ఆమె గాజుకళ్లల్లో తడిలాంటిది కన్పించింది. కూర్చునివున్న ఆడవాళ్లంతా కూడబలుక్కున్నట్లు నిశ్శబ్దంగావుండి పోయారు. ఎవరూ సమాధానం చెప్పలేదు. ముసల్ది వంటింట్లోకి మెల్లగా నడిచి వెళ్లిపోయింది.

"ఎవరదీ?" "మరాటీ సీతి. రోజా వచ్చి కూరో,చారో పోయించుకుపోతుంది." "ఎదన్నామాటకీ పనికీ సుబ్బమ్మకి సాయంగావుంటుంది." "ముసల్ది ఏమి సాయంచేస్తుంది?" "దానికి చేతనయ్యింది" వరుసగా తలోమాటా అన్నారు.

కాలేజిలో బి.ఏ. చదువుతున్న విజయ "ఎందుకే, భార్యభర్తల్ని పార్వతీ పరమేశ్వరులతో పోలుస్తారు?... అహ, సరస్వతీ బ్రహ్మదేవూడూ అనరేమి?" అన్నది రోహిణితో.

"ఏమోనే, నాకూ అదే సందేహం వున్నది, నాకుతెలిసిన అన్నికథల్లోనూ పార్వతీ పరమేశ్వరులకు తగవులు, పంతాలు, పట్టింపులు వున్నాయి మనకు లాగానే " అన్నది రోహిణి.

"మనకులాగా అంటావేమిటి, యింకా పెళ్లీపెటాకులు కాకుండానే!" ఉత్సాహంగా నవ్వింది విజయ.

"వెధవ చచ్చుజోకులూ నువ్వూను! మన అమ్మలూ, అత్తలూ అమ్మమ్మలు అందరి సంసారాలు చూడ్డంలేదా! ఎప్పుడూ కీచులాటలే!... అసలు పెళ్లంటేనే అనవసరపుగోల..." విజయని కసురుతూనే, పెద్దలందరివేపూ గర్వంగా చూసింది రోహిణి. "పెద్దవ్వా నువ్వు చెప్పు!" కొంటెగానవ్వుతూ అడిగింది విజయ.

పెద్దవ్వ రెండేళ్లకోసారి కడపజిల్లా కందిమల్లాయపల్లెలో వీరబ్రహ్మేంద్ర స్వామివారి మఠానికి వెళ్లివస్తుంది. పెద్దపెద్దగురువులు వూళ్లోకి వచ్చినప్పుడు మంచి చీరకట్టుకుని వెళ్లి, వారు చెప్పే మంచిమాటలు వినివస్తుంది. పిల్లజాతి ఆమెచేత ధర్మపన్నాలు చెప్పించి నవ్వుకుంటారు.

పెద్దవ్వ వాళ్ల విరగబాటుకు గట్టిగా మందలించింది."నూరేళ్లు కలిసి బ్రతకాల్సిన వాళ్లకు కీచులాటలు రావా? హెచ్చులూ తగ్గులూ కోపతాపాలూ దాటుకుంటూ, మీదపడుతున్న ఎంగిలితుంపర్లు తుడుచుకుంటూనే, తన మనిషనుకుంటూ మంచికోరటం అభిమానించటం తక్కువ సంగతికాదు. అక్కడేవుంది అసలుసంగతి! చివరికంటూకలిసి బతికేవాళ్లకి కాలంతో ఆములు చల్లారి ఆఖరికి మమకారం ఒత్తిలాగా వెలుగుతుంది!... ఇది ధర్మం. ఇదిశాస్త్రం... జీవితమంటే మీరు చదివే ప్రేమకథలూ, పిచ్చివూహలూ కాదూ... చాలలోతైన సంగతి!" అని కోప్పడ్డది.

ఈ సంభాషణను నిరసనతో వింటున్నారు అక్కడ కూర్చుని వున్న పెద్దలు. బాహాటంగా ఒకర్తోఒకరు చెప్పుకోవటం జరక్కపోయినా యీ పిల్లలిద్దరూ తమను కాపాడుతూ వస్తున్న కట్టుబాట్లకు తిలోదకాలిచ్చి, ఏ తురకాళ్లనో కట్టుకుని బ్రతుకులు అల్లకల్లోలం చేసుకుంటారనీ, కొంపలకు అగ్గిపెడతారనీ లోపల్లోపల జాగ్రత్తపడుతూ, వాళ్లమీద ఒకకన్ను వేసి వుంటున్నారు.

కాంతయ్యగారి సూట్‌కేస్ సర్దేశారు. హోల్డాలును బిగించి కట్టేస్తున్నాడు చలపతి. సుబ్బవ్వకు కడుపులో దేవినట్లుంది. పూనకం వచ్చినట్లుంది. బ్రతుకంతా అదుపుదప్పి అస్తవ్యస్తమై పోతున్నట్లుంది. "నీవూవెళ్తావా?" అని ఒక్కరూ ఆమెనడగలేదు. ఎనుములూ, కోళ్లూ, ధాన్యం, యిల్లూ - ఆమె యిక్కడ చూసుకోవాల్సిన విషయాలున్నవి. అక్కడ ఆమె చెయ్యవలసిందేమీ లేదు.

చెప్పలేని ఆరాటం పట్టుకుని ఊపేస్తుంటే, కొడుకుని కేకేసింది.

"పనుల మీద తిరుగుతున్నావు, నువ్వు ముందుతిను" అని కంచంపెట్టి అన్నం వడ్డించింది. ఒంటరిగా కొడుకుతో ఏమేమో చెప్పాలని తపన.

ఆఖరికి "మీ నాయన్ని జాగర్తగా చూసుకోరా లక్ష్మిందేవితో చెప్పు... వేళకి పాలూ,

కాఫీ...'' అన్నది.

"నాకు తెలుసులేమ్మా" అన్నాడు చలపతి. సంభాషణ అయిపోయింది. ఆమెలో నిరాశ నిండిపోయింది. ఒకమనిషి తన మనిషి కోసం చెయ్యగలిగేది కొంచెం, చెయ్యలేనిది ఎంతో వుంటుందనే విషయం ఎప్పుడో ఒక్కసారే అనుభవానికొస్తుంది - ఆమె మనసు బూడిదై పోయింది...

టాక్సీవచ్చింది. కాంతయ్యతాత వంటింట్లోకి వచ్చాడు. ఒరుగైపోయిన సుబ్బమ్మను పరికించి చూశాడు. ఈ మధ్యన మరీ తగ్గిపోయింది, మా కాలం అయిపోయింది అనుకున్నాడు. "వెళ్తాను" అన్నాడు. సుబ్బవ్వకు ఏడవాలనీ, దణ్ణంపెట్టాలనీ, అతనికాళ్ళదగ్గర తల పగలగొట్టుకోవాలనీ - ఇదమిద్ధమని తెలియరాని ఆవేశం కలిగింది. కాని అంతటినీ దిగమ్రింగుకొని "ఊ" అని తలూపింది. "వాళ్లందరికీ అన్నంపెట్టు... నేను వెళ్తున్నాను" అనేసి పనైపోయినట్లు గబగబానడుస్తూ తోబుట్టువుల మధ్యకు వెళ్లిపోయాడు.

★★★

నెల మొదటితేదీ గనుక ఇంటద్దె చెల్లించడానికి బయల్దేరిన రామారావు వెంట శ్రీనివాసరావు కూడా వెళ్లాడు. టాక్సీ ఎక్కడానికి బయటకు వచ్చిన కాంతయ్యగారు రామారావు యిచ్చిన డబ్బును జాగ్రత్తగా లెక్కబెట్టుకున్నారు. రెండోసారి లెక్క సరిచూసుకున్నారు. కరెంటు యూనిట్లకీ బిల్లుకీ సరిచూసుకున్నారు. ఆతర్వాత రామారావుకివ్వవలసిన చిల్లర పావలాబిళ్లను జేబుల్లో గాలించి బయటికి తీసి యిచ్చి, పలకరింపుగా నవ్వారు. పెదాలమీదినుంచీ కళ్లల్లోకి ప్రాకి స్నేహభావంగా అవతలిమనిషిని తాకే నవ్వు - ఆయన అలవాటు -

"ఆయన అదోరకం మనిషి !" అన్నాడు రామారావు కాస్త అవతలికెళ్లగానే, చిన్నగా.

"అంటే?"

"అంటే ఏమీలేదు... ఇందాక చూశారుగా... వెధవపావలా చిల్లర యివ్వటానికి - వద్దని చెప్తున్నావినకుండా-ఎంత వెదికి తీసిచ్చాడు! మనం యివ్వాల్సివుంటే పదిపైసలయినా అంత ఖచ్చితంగానూ యివ్వాలి. చిన్న విషయాల్లో పట్టువిడుపూ లేదు... నా మాటలు మీకు నచ్చవు లెండి..."

"వ్యవహారాల్లో ఖచ్చితంగా వుండేతత్త్వం మంచిదేగదా... అసలు ఆ ధైర్యానికి మెచ్చుకోవాలయ్యా-ఆయనకి బెంగుళూరునుంచీ తిరిగివచ్చి యీ యిల్లు చూస్తానన్న నమ్మకంలేదుగదా - జీవితకాలమంతా ఒకనమ్మకంతో బ్రతికినమనిషి, యిక్కడ ఏర్పరుచుకున్న బంధాలన్నీ యిక్కడే వదిలిపెట్టి, అంధకారపు భవిష్యత్తులోకి

నిత్యకృత్యంలాగా అడుగుపెట్టడానికి ఎంత తెగువకావాలి! అటువంటి నిబ్బరం ఎక్కణ్ణుంచీ వస్తుందో!" అన్నాడు శ్రీనివాసరావు.

జీవితాన్ని ప్రేమించనిచ్చేదీ, చావుబ్రతుకుల వెనుకనుండేదీ అయిన రహస్యజ్ఞానం కోసం వెదుకుతూ వుంటాడతను. అది జీవించడం ద్వారానే తప్ప మరేవిధానా తెలియరాదేమోనని అతని అనుమానం.

"నేనన్నదీ అదేగదండీ-ఆ పెద్దాయన ఈ ఆఖరిదశకు వచ్చికూడా చిన్న విషయాల్లో చిక్కుకుని వున్నాడనీ" గురువుగారి వెర్రి ధోరణికి అడ్డుకట్టవెయ్యవలసిన అవసరం గ్రహించిన రామారావు "మన మ్యాట్నీకి టికెట్లు దొరుకుతాయో లేదో" అంటూ అతడ్ని లాక్కుపోయాడు.

★★★

కాంతయ్యగారు వెళ్లిపోయారు. మూర్ఛురాలిలాగా గాజుకళ్లతో చుట్టూచూసింది సుబ్బవ్వ. తనెవరో కూడా మరచిపోయినట్లు కూర్చుండిపోయింది.

"సుబ్బమ్మా, లే!" అన్నది పెద్దవ్వ కర్తవ్యాన్ని గుర్తుచేస్తున్నట్లు, తట్టి మేల్కొల్పుతున్నట్లు.

ప్రకృతంలోనికి వచ్చిన సుబ్బవ్వకు మనసులోని గుబులంతా రూపాంతరం చెంది, "వాళ్ల" మీది అప్యాయతగా మారి వంటింట్లోకి దారితీసింది.

అందరికీ భోజనాలు పెట్టి పంపేసరికి మధ్యాహ్నం మూడుగంటలైంది. ఇంట్లో అర్థంలేని, చలనంలేని నిశ్శబ్దం ఘనీభవించింది. మరాటీసీత మెల్లగా తిరుగుతూ అవీయివీ సర్దుతున్నది.

సుబ్బవ్వ నట్టింట్లో కూర్చుంది. "డబ్బు జాగ్రత్త" అన్న మాటలు పిచ్చిగా పదేపదే మనసులో సుళ్ళు తిరుగుతున్నవి... ఆయన ఎంతో జాగ్రత్తగా తమ అవసరాల కోసం పదిలపరచిన డబ్బు... ఆమెను కుదిపివేస్తూ లోన అజ్ఞాతంలో రగుల్తున్న అగ్నిపర్వతం... "నాకు డబ్బెందుకుస్వామీ" అని భోరుమని ఏడ్చేసింది సుబ్బవ్వ. ఈ కుటుంబాన్ని, యీయింటినీ, యీ జీవితాన్ని మలుచుకుంటూ జీవనపోరాటంలో గడిపిన కాలానికి నాందిగా తమ గుండెల్లోని తియ్యదనాన్నంతా మరో ఆలోచనలేకుండా కలబోసుకున్ననాటి తీపిగుర్తులు యాభై ఏళ్లమరుపునుంచీ వెలువడి వెల్లువగా పారిరాగా, ఏం చెయ్యాలో అర్థంకాక, గొప్పమోసం జరిగిపోయినట్లు తబ్బిబ్బైపోయి రోదించింది.

మరాటీసీత నిలబడి కొంచెంసేపు చూసింది. మెల్లగా దగ్గరకువచ్చి కొవ్వు హరించుకుపోగా, దూదుల్లా తెల్లగ్గావున్న చేతుల్తో సుబ్బవ్వ చేతులు పట్టుకుంది. "ఊరుకోమ్మ... వూరుకో... మనచేతిలో ఏముందమ్మ... ఇప్పుడేమైందని? నట్టింట

కూర్చుని యాడవద్దు... వాళ్లకి జయంకాదు" అన్నది, వూగిపోయే తలను మరింతగా వూపుతూ.

మరాటిసీత మాటలు ఊతంగా తన్నుతాను నిలవరించుకుంది, యీ ఎదురుదెబ్బతో ఎదిగిపోయిన సుబ్బవ్వ. అవును, క్షణాల్లో, ఆశల్లో బ్రతకాల్సిన వాళ్ల చేతిలో ఏమీలేదు!... ఇప్పుడేమైందనీ!

"ఏమిటో గుబులైంది, సీతీ!" అన్నది. జయం కలగాలి! అనుకుంది స్థిరంగా.

★★★

"ఆ స్థైర్యం మన ఊహకి అందదు" అంటూ జాలిపడుతున్నాడు మ్యాట్నీ చూచివచ్చిన శ్రీనివాసరావు ప్రక్కపోర్షన్‌లో కాఫీ త్రాగుతూ.

★★★